సాక్షి అనకాపల్లి

శనివారం । 1 । జూలై । 2023



హుండీ ఆదాయం రూ.3.77 లక్షలు

జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా గవరపాలెం ఆలయ హుండీ ఆదాయం రూ.3,77,113 లభించినట్టు ఈవో చెప్పారు.



సమస్యల పరిష్కారానికే సురక్ష

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. IIలో

వర్షసూచన

అనకాపల్లిటౌన్ : రాగల నాలుగు రోజులు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ శాస్త్రవేత్త కుమారి శుక్రవారం పేర్కొన్నారు. జులై 1న 2, 3న 8, 4న 12, 5న 15 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 34.8 నుంచి 35 డిగ్రీలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

2న వైఎస్సార్‌సీపీ బైక్‌ర్యాలీ

అనకాపల్లిటౌన్: స్థానిక రైల్వే స్టేషన్ నుంచి మునగపాక వరకు జులై 2న భారీ బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు అనకాపల్లి రైల్వే స్టేషన్(రింగ్‌రోడ్డు) వద్ద ఈ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. రింగ్ రోడ్డు మీదుగా చిన్ననాలుగురోడ్ల జంక్షన్, వేల్పులవీధి జంక్షన్, నెహ్రూచౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి మీదుగా మునగపాకలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వరకు ర్యాలీ సాగుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

కొబ్బరి, గాజుల సేకరణకు కొటేషన్లు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 1 నుంచి 14 వరకూ భక్తులు సమర్పించే కొబ్బరి కాయల్లో సగ భాగం, గాజులు, పప్పుల్ని ప్రతి రోజూ పోగు చేసుకునేందుకు ఆసక్తి గల భక్తుల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆయల ఈవో బండారు ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. భక్తులు తమ కొటేషన్లను లిఖిత పూర్వకంగా దేవస్థానం కార్యాలయంలో 1వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు.

ఎంఈవోలు, హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

అనకాపల్లిటౌన్: జిల్లాలో నాడు–నేడు పనులు, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీలో జాప్యం చేసిన 24 మంది ఎంఈవోలతోపాటు 187 మంది ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖాధికారులు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయనందున నోటీసులు జారీ చేశామని ఆమె చెప్పారు. నోటీసులు అందుకున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు.

3 నుంచి దూరవిద్య పరీక్షలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏయూ దూరవిద్య కేంద్రం యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు రెండవ, మూడవ సంవత్సరం, డిప్లమో ఇన్ మ్యూజిక్(ద్వితీయ సంవత్సరం) పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. మూడవ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 46 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

తుమ్మపాల: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ద్వారా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్టు నేక్ సహాయ సంచాలకులు ఎస్.వి.ఎస్.ఎస్. రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై 15 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు గల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని, మాకవరపాలెంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించే శిక్షణలో స్టేషనరీ ఉచితంగా ఇస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణకు ఎటువంటి ఫీజు లేదని, ఆసక్తి గల అభ్యర్థులు 7780275922, 9394885164 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జియో ఫెన్సింగ్ విధానంలో ఈ-క్రాప్ నమోదు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కె.కోటపాడు : ఈ ఏడాది నుంచి జియో ఫెన్సింగ్ విధానంలో ఈ–క్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని వారాడలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సర్వే నంబరు వద్దకు వెళ్లి పంట నమోదు చేయాలన్నారు. వేసవి దుక్కులు, మట్టి నమూనా పరీక్షలు, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. విశాఖపట్నంలో రైతు బజార్ కార్డులు కలిగి ఉన్న మండలంలోని సుమారు 450 మంది రైతులు ఆయా గ్రామాల్లోనే నివసిస్తున్నారో లేదో తెలుసుకున్నారు. సమావేశంలో సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, ఏఈవో లైలాదేవి, వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు.

● క్షణాల్లో మంటలు.. మిన్నంటిన హాహాకారాలు

ఫార్మాలో విషాదం



దట్టంగా కమ్ముకున్న పొగ

- అచ్యుతాపురం సెజ్‌లో భారీ అగ్నిప్రమాదం
- సాహితి ఫార్మాలో పేలిన రియాక్టర్లు
- ఇద్దరు కార్మికుల మృతి
- మరో నలుగురి పరిస్థితి విషమం
- ఒకరికి స్వల్ప గాయాలు
- భయాందోళనలో కార్మికులు, సమీప గ్రామాల ప్రజలు



సాహితి ఫార్మా కంపెనీలో వ్యాపించిన మంటలు

రాంబిల్లి : గతంలో ఎన్నడూ చూడని విధంగా అగ్నికీలలు.. ఆకాశాన్ని అంటుతున్నట్టుగా ఎగసిపడుతున్న మంటలు.. దట్టంగా కమ్ముకున్న పొగ.. భారీ శబ్దాలు.. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి.. హాహాకారాలు చేస్తూ కార్మికుల పరుగులు.. సమీప గ్రామాల ప్రజల్లో భయాందోళన.. ఇదీ శుక్రవారం అచ్యుతాపురం–రాంబిల్లి సెజ్‌లోని సాహితి ఫార్మా పరిశ్రమ వద్ద పరిస్థితి. వివరాలు..

ఉదయం ఎ–షిఫ్ట్‌కు యూనిట్–1లో 35 మంది కార్మికులు హాజరయ్యారు. సాల్వెంట్ లోడింగ్ చేస్తుండగా 11.10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. క్షణాల్లో వ్యాపించాయి. ఈ క్రమంలో సమీపంలో ఉన్న రెండు రియాక్టర్లు భారీ శబ్దంతో పేలాయి. పొగలు, మంటలు, భారీ శబ్దాలతో ఈ ప్రాంతం దద్దరిల్లిపోయింది. దిక్కు తోచని కార్మికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పరుగులు తీశారు. ప్రమాదంలో ఏడుగురు కార్మికులు గాయపడ్డారు. వీరిలో అచ్యుతాపురం మండలం జంగాలపాలేనికి చెందిన పైల సత్తిబాబు(35), విజయనగరానికి చెందిన తిరుపతి(28)లను విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రాంబిల్లి మండలం పంచదార్లకు చెందిన ఎస్.నూకినాయుడు(48), భువనేశ్వర్‌కు చెందిన రామేశ్వర్(40), నక్కపల్లికి చెందిన ఎస్.అప్పారావు(43), అనకాపల్లి మండలం రేబాకకు చెందిన ఎస్.రాజుబాబు(23)లు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు తెలిపారు. కొండ కొప్పాకకు చెందిన సంతోష్‌కుమార్ స్వల్ప గాయాలతో అచ్యుతాపురం స్టార్ జెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏడు ఫైరింజన్లతో మంటలను అదుపుచేయవలసి వచ్చింది. మంటలు అదుపు చేసే ప్రయత్నంలో ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది గాయపడ్డారు.

పేలిన సాల్వెంట్ రియాక్టర్

సాల్వెంట్ లోడింగ్ చేస్తుండగా మంటలు చెలరేగి ఈ ప్రమాదం చోటుచేసుకుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. మంటలు వ్యాపించడం వల్ల రియాక్టర్లు పేలినట్టు చెప్పారు. సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఉదయం 11.10కి ఈ ప్రమాదం జరిగిందని తమకు సమాచారం వచ్చిన వెంటనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి మంటలు అదుపు చేసి, క్షతగాత్రుల తరలింపు, ఇతర రక్షణ చర్యలు తీసుకున్నామన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

భద్రత ప్రమాణాలు పాటించట్లేదు

కంపెనీల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదని ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు(కన్నబాబు)అన్నారు. కంపెనీ వద్ద ప్రమాద పరిస్థితిని పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పరిశ్రమల్లో భద్రతా చర్యల పర్యవేక్షణపై ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ల తీరు దారుణంగా ఉందన్నారు. ముందస్తుగా తగిన భద్రతా చర్యలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగవన్నారు. విచారణ తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో, తహసీల్దార్ ఇతర అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అగ్నిమాపక సిబ్బందికి చికిత్స



వైద్యాలయంలో చికిత్సపొందుతున్న క్షతగాత్రుడ్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్

అనకాపల్లిటౌన్: సాహితి ఫార్మా కంపెనీలో మంటలు ఆర్పుతుండగా గాయపడిన విశాఖలోని మర్రిపాలెం అగ్నిమాపకదళానికి చెందిన ముగ్గురు సిబ్బందికి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స అందజేశారు. ఈ ప్రమాదంలో విషాల్‌షాబీ, లాలం రాఘవ, బాలకృష్ణలు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ పరీక్షించి, చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

● డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని సమస్యలను పరిష్కరించనున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. జులై 1 నుంచి నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఎం.కోడూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు అధికారులతో రెండు బృందాలను ఏర్పాటు చేశామని, ఎంపీడీవో పర్యవేక్షణలో ఒక బృందం, తహసీల్దారు పర్యవేక్షణలో మరో బృందం పనిచేస్తాయని చెప్పారు.

ఈ రెండు బృందాల్లోని అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లోని సచివాలయాల్లో ఉండి ప్రజలు సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. జగనన్న సురక్ష పథకం ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామాన్ని జల్లెడ పట్టి అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గుర్తించాలని సూచించారు. ప్రజల అవసరాలు తీర్చేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అధికారుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజకీయ, కుల, మత, వర్గాలకు అతీతంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ప్రజల మంచి కోసం చేపట్టినట్టు చెప్పారు. భూ సమస్యలు మొదలుకుని ప్రాధాన్యం ఉన్న ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

అన్ని గ్రామాల్లో రోడ్లు వేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. జల్ జీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. లింక్ రోడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోందన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు టి.వి.రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు పాల్గొన్నారు.

వైభవంగా తిరుగు రథ యాత్ర



రథంపై కొలువైన సుభద్ర, బలభద్ర సమేతుడైన జగన్నాథస్వామి

చోడవరం : జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర శుక్రవారం మహిళా బృందాల కోలాటాలు, నృత్యాలు, మేళతాళాల మధ్య వైభవంగా సాగింది. తొలి రథయాత్ర అనంతరం స్థానిక కేశవస్వామి ఆలయం ఆవరణలో పదిరోజుల పాటు స్వామివారి దశావతార దర్శనం కార్యక్రమాలు జరిగాయి. తిరుగు రథయాత్రోత్సవాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, సీఐ బి. శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ అలమండ ఈశ్వరరావు, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రారంభమైన ఈ రథయాత్ర పెదబజార్, కోఆపరేటివ్ కాలనీ, మెయిన్‌రోడ్డు, పీఎస్‌పేట రోడ్డు, శివాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, కొత్తూరు జంక్షన్ మీదుగా కేశవస్వామి ఆలయ ప్రాంగణం ఉపాలయంలో వేంచేసియున్న జగన్నాథస్వామి ఆలయం వరకు కన్నుల పండువగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సుభద్ర, బలభద్ర, జగన్నాథస్వామి ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు, సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారి రథం లాగుతూ గోవిందనామస్మరణ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, కేశవస్వామి ఆలయం మాజీ చైర్మన్ ఉప్పలబాబు తదితరులు పాల్గొన్నారు.

● సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బొడ్డేడ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు జిల్లా పార్టీ అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపి, పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమించాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని ప్రసాద్ తెలిపారు. ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని బొడ్డేడ ప్రసాద్‌తో పాటు వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు కలిశారు.

- మునగపాక

కోనాం, పెద్దేరు జలాశయాల సందర్శన



కోనాం జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ సూర్యకుమార్

చీడికాడ/ మాడుగుల రూరల్: చీడికాడ మండలంలోని కోనాం జలాశయాన్ని, మాడుగుల మండలంలోని రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయాన్ని ఇరిగేషన్ ఎస్ఈ సూర్యకుమార్ శుక్రవారం సందర్శించారు. ప్రధాన గేట్లతో పాటు హైలెవెల్ కాలువ గేట్లు పరిశీలించారు. జలాశయంలో గల నీటి నిల్వలు, లీకేజీలపై ఆరా తీశారు.ఆయన వెంట డీఈ వేణుగోపాల్‌నాయుడు, ఏఈ జయరామ్, మెకానికల్ డీఈఈ గోపాలకృష్ణ, పెద్దేరు జలాశయం డీఈఈ వి. చిన్నంనాయుడు తదితరులున్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల : నావికాదళానికి చెందిన ఎన్ఏవోబీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ ఎం.జాహ్నవి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. నేవెల్ బేస్ ప్రాంతంలో మత్స్యకారుల బోట్లను రోడ్డు మార్గంలో దగ్గరలోని బీచ్‌కు తరలించాలన్నారు. బంగారమ్మపాలెం గేట్–బి ద్వారా ప్రవేశం కల్పించాలన్నారు. కొప్పుగొండపాలెం తదితర ఐదు గ్రామాల వారు తమ భూములకు వెళ్లేందుకు నేవీ యంత్రాంగం రోడ్డుకు స్థలాన్ని ఇవ్వాలని, బదులుగా ఎస్.రాయవరంలో కొంత భూమిని నేవీకి ఇచ్చేలా పరిశీలించాలన్నారు. నిర్వాసితులలో కుటుంబానికి ఒక ఉద్యోగం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను సూచించారు. అంతకు ముందు ఎలిమినేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ ముగింపు కార్యక్రమంలో బాలకార్మికులకు కనీస వేతన చట్టం కింద నష్టపరిహారం అందించారు. నెల రోజులుగా జరిగిన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దిశగా చేపట్టిన దాడుల్లో 15 కేసులు నమోదు చేశామన్నారు. బాల కార్మికుల చేత పని చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ, మత్స్యశాఖ డీడీ లక్ష్మణరావు, కార్మిక శాఖ అధికారులు కె.నరేంద్ర, పి.సత్యనారాయణ, బి.రామచంద్రరావు, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

• ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాన్ని చేపట్టలేదన్నారు. శనివారం నుంచి గ్రామాల్లో ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు వివిధిగా పాల్గొని ప్రజా సమస్యలు పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. 11 రకాల సేవలతో పాటు అర్హత ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి ఈ కార్యక్రమంలో నమోదు చేసి మంజూరు చేయాలన్నారు. వలంటీర్లంతా విధిగా వారికి కేటాయించిన గృహాలను సందర్శించి న్యాయం చేయాలన్నారు.

ప్రత్యక్ష దైవాలు వైద్యులు



స్వచ్ఛమైన తెల్లని కోటు, ఆత్మీయమైన చెరగని చిరునవ్వు, మొక్కవోని నిబ్బరం, అలుపెరగని అంకితభావం, విసుగెరగని వృత్తి ప్రేమ వైద్యునికి సహజ ఆభరణాలు. ఈ ఆభరణాలు ధరించి వచ్చే వైద్యుడిని చూడగానే రోగికి సగం స్వస్థత చేకూరుతుంది. తల్లి జన్మనిస్తే.. వైద్యుడు పునర్జన్మనిస్తాడు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం. వైద్యుడు, రాజకీయ వేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ బీదాన్ చంద్ర రాయ్ సేవలకు గుర్తింపుగా డాక్టర్స్ డే జరుపుకుంటున్నాం.

- మహారాణిపేట

జాయింట్ రీప్లేస్‌మెంట్‌కు కేరాఫ్ క్యూ1



రాష్ట్రంలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ అంటే గుర్తుకొచ్చేది ఆరిలోవ హెల్త్‌సిటీలోని క్యూ1ఆస్పత్రి. కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సల్లో ప్రసిద్ధి గాంచిన డాక్టర్ రమణమూర్తి నేతృత్వంలో అత్యంత అనుభవజ్ఞులు, నిపుణులైన వైద్య బృందం, సిబ్బంది ఇక్కడ అందుబాటులో ఉన్నారు. రాష్ట్రంలో ప్రప్రథమ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్, కంప్యూటర్ నావిగేషన్ టెక్నాలజీ సెంటర్ ఇదే. కీళ్ల మార్పిడికి ప్రత్యేకించి ప్రపంచస్థాయి అడ్వాన్స్‌డ్ లామినర్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. కీళ్ల వ్యాధులను నిర్ధారించే అన్ని రకాల రేడియాలజీ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రపంచ దేశాల్లో లభించే ప్రతి కృత్రిమ జాయింట్ ఇక్కడ అందుబాటులో ఉంది. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన డాక్టర్ రమణమూర్తి 20 ఏళ్ల కాలంలో దాదాపు 25 వేల జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు చేశారు. అధునాతన టెక్నాలజీతో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఆర్థరైటిస్‌లో కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్స జరిగిన రెండో రోజు నుంచే నడక ప్రారంభించవచ్చని డాక్టర్ రమణమూర్తి తెలిపారు. చాలా మంది పురుషులతో పాటు మహిళలు, ముఖ్యంగా వృద్ధులు పని ఒత్తిడి, వయసు రీత్యా, వివిధ కారణాలతో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. వారికి రోబోటిక్ అసిస్టెడ్ కీళ్లమార్పిడి చికిత్స ద్వారా ఉపశమనం కలగజేయవచ్చని వివరించారు.

వైద్యంతో పాటు సేవలు



ఆ కుటుంబంలో మొత్తం వైద్యులుగా సేవలందిస్తున్నారు. డాక్టర్ గంటా వెంకటేశ్వరరావు జనరల్ ఫిజీషియన్‌గా, అతని భార్య గంటా లలిత గైనకాలజిస్ట్‌గా, కుమార్తె డాక్టర్ సునీత ప్లాస్టిక్ సర్జన్‌గా, అల్లుడు రఘు ఆర్థోపెడిక్ రంగంలో వైద్యుడిగా పని చేస్తున్నారు. 40 ఏళ్లగా వైద్య రంగంలో ఉంటూ విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నీటి కోసం గిరిజనుల పడుతున్న కష్టాలను స్వయంగా చూసిన డాక్టర్.. వారి కోసం వాటర్ ట్యాంకు నిర్మించారు. పెందుర్తిలో వృద్ధుల ఆశ్రమానికి రూ.12 లక్షల నిధులతో, నరవ వద్ద అనాథ పిల్లల ఆశ్రమానికి రూ.8 లక్షల వ్యయంతో సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు.

కంటి పాపలకు రక్ష



చిన్నారుల కంటి సంరక్షణకు విశాలాక్షినగర్‌లోని విజన్ ట్రీ ఆస్పత్రి విశేషంగా కృషి చేస్తోంది. ఏటా చిన్న పిల్లలకు కంటి పరీక్షలు చేయించడం ద్వారా అంధత్వానికి గల కారణాలను ముందుగా గుర్తిస్తున్నారు. దీని వల్ల కొంతవరకు అంధత్వాన్ని నివారించవచ్చని డాక్టర్ మధు ఉద్దరాజు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కంటికి మేలు జరుగుతుందన్నారు. ఆకుకూరలు, క్యారెట్, పాలు, గుడ్లు, చేప వంటివి ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కళ్లకి సరైన విశ్రాంతి అవసరమని, ప్రతి రోజూ 7 నుంచి 8 గంటల వరకు నిద్రపోవాలన్నారు. ప్రతి రోజూ 40 నుంచి 60 నిమిషాల పాటు చిన్నారులు ఆరుబయట ఆటలు ఆడటం ద్వారా కంటికి మంచి జరుగుతుంది.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్: స్థానిక లాడ్జిలో విశాఖ కంచరపాలేనికి చెందిన ఎ.వంశీ(20) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం లాడ్జిలోకి దిగిన అతడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. తండ్రి శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కె.కోటపాడు : కారులో వారాడ గ్రామం గుండా గంజాయిని తరలిస్తూ ఎ.కోడూరు పోలీసులకు ఇద్దరు యువకులు గురువారం రాత్రి పట్టుబడ్డారు. వారాడ జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్.ఐ బి.రామకృష్ణ కారును తనిఖీ చేయగా, గోనె సంచుల్లో 110 కిలోల గంజాయి పట్టుబడింది. కారులో గంజాయిని తరలిస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు దేవానంద్ పండా, కన్హా సాహులను అరెస్ట్ చేశారు. కారును సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 25 కుటుంబాలు



టీడీపీ శ్రేణులను పార్టీలోకి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: మండలంలో శంకరం పంచాయతీ శివారు మామిడిపాలెంలో 25 కుటుంబాల వారు టీడీపీని వీడి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు దారపర్తి బాలరాజు ఆధ్వర్యంలో గుడెసె చిన్నమ్మలు, తారా పోతురాజు, సోముల శ్రీరామూర్తి, సోముల రాజులమ్మ, సోముల రాములమ్మ, తారా దేముడమ్మ, సాముల సన్యాసమ్మ, సాముల సన్యాసిరావు, తారా దేముడమ్మ, శోలం కల్యాణం, తదితర 25 కుటుంబాల వారు పార్టీలో చేరారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ శోలం రమేశ్, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళిత చైర్‌పర్సన్‌ను కాబట్టే అవమానించారు

• టీడీపీ కౌన్సిలర్ల తీరుపై సుబ్బలక్ష్మి ఆవేదన



నర్సీపట్నం: మున్సిపల్ చైర్‌పర్సన్ హోదాలో తొలిసారి అడుగు పెట్టిన తనను టీడీపీ కౌన్సిలర్లు అవమానించారని చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఆమె మాట్లాడుతూ తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన సందర్భంగా మర్యాదపూర్వకంగా అందరికీ అభివాదం చేశానన్నారు. ప్రతిపక్షానికి చెందిన జనసేన కౌన్సిలర్ తనను అభినందించారన్నారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ పద్మావతితోపాటు టీడీపీ కౌన్సిలర్లు సమావేశం నుంచి వెళ్లిపోయి తనను అవమానించారని వాపోయారు. ఒక దళిత మహిళ చైర్‌పర్సన్ సీట్లో కూర్చోవడాన్ని వారు జీర్ణించుకోలేక వాకౌట్ చేశారన్నారు. చైర్‌పర్సన్ సీటుకు కనీస గౌరవం ఇవ్వాలన్న ఆలోచన లేకపోవటం దురదృష్టకరమన్నారు.

కేఎం చానల్‌ను పరిశీలించిన ఇరిగేషన్ డీఈ



కేఎం చానల్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న చిన్నంనాయుడు

రావికమతం: పెద్దేరు కుడి ప్రధాన కాలువకు సంబంధించి కొమిర–మత్స్యపురం(కేఎం) చానల్‌ను ఇరిగేషన్ డీఈ చిన్నంనాయుడు శుక్రవారం పరిశీలించారు. సాంకేతిక కారణాలతో 16 ఏళ్లుగా కేఎం చానల్‌కు నీరు పారలేదు. ఆ రెండు గ్రామాల ఆయకట్టు 800 ఎకరాలుండగా, సంబంధిత రైతులు తరచూ ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఇటీవల పెద్దేరు రిజర్వాయర్ కాలువల లైనింగ్‌కు, అదనపు ఆయకట్టుకు నీరందించే చర్యలకు గానూ రూ.84.44 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో కేఎం చానల్‌కు నీరొచ్చే ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సదరు రైతులకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కాలువ నీరు పారుదలకు సాధ్యాసాధ్యాలను డీఈ పరిశీలించారు. రైతుల సూచనలు తీసుకున్నారు. సర్పంచ్ గొర్లె రవికుమార్, ఎంపీటీసీలు బంటు శ్రీను విజయలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి!

కశింకోట: బయ్యవరంలో శుక్రవారం గొర్లి సోమశేఖర్(23) అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికుల కథనం మేరు.. ఇక్కడ రైల్వే గేటు వద్ద గురువారం రాత్రి మరో ఇద్దరితో చెలరేగిన ఘర్షణలో అతను గాయపడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తన ఇంటి వద్ద సోమశేఖర్ మృతి చెందాడు. అయితే మద్యం ఎక్కువగా సేవించడం వల్ల మృతి చెంది ఉండవచ్చునని మరికొందరు అనుమానిస్తున్నారు. ఈ విషయమై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

యలమంచిలి : యలమంచిలి యర్రవరం జాతీయ రహదారిపై భారత్ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ కె.సావిత్రినాయుడు తెలిపిన వివరాలివి. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కె.ఓ మల్లవరం గ్రామానికి చెందిన ఎమ్మిలి చిన్నయ్య (30) తన ద్విచక్ర వాహనంపై పరవాడ వెళుతుండగా కోదాడ నుంచి లంకెలపాలెం వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నయ్య తలకు బలమైన గాయాలు కావడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖలో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో నలుగురికి ఏడేళ్ల జైలు

చోడవరం రూరల్ : పొరుగింటి గృహిణిని నమ్మించి తమ వెంట తీసుకుని వెళ్లి అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం అరకులో నిర్జన ప్రదేశంలో ఆమె మెడలో చున్నీని బిగించి హత్య చేయడానికి ప్రయత్నించిన నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన అడిషనల్ పీపీ వేచలపు వెంకటరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురానికి చెందిన నిందితులు కర్రి షర్మిల, మామిడి త్రివేణి, సరిపల్లి సరోజిని, కొత్తపల్లి దుర్గలు విశాఖపట్నం, కంచరపాలెం రాజీవ్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. విశాఖలోని కంచరపాలెం, కప్పరాడలో గనిరెడ్డి కమల నివాసం ఉంటుంది. కర్రి షర్మిల భర్త సోమేష్ తన భార్యతో గొడవ పడినప్పుడల్లా తాను గనిరెడ్డి కమలను రెండో వివాహం చేసుకుంటానంటూ బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో షర్మిల 2016 మే నెల 5న తామంతా పార్వతీపురం వెళ్తున్నట్టు కమలకు కబురు పెట్టారు. కమల తన ఏడాదిన్నర వయసు గల కుమారుడిని వెంట పెట్టుకుని వారితో బయలు దేరింది. తీరా రైల్వే స్టేషన్‌లో ఉదయం 11.30 గంటల సమయంలో అరకు వెళ్లే రైలు ఎక్కించారు. అరకు చూసుకుని వెళదామంటూ కమలను నమ్మబలికారు. అరకు స్టేషన్‌లో కమలను దిగమని చెప్పగా ఆమె నిరాకరించి ఇంటికి వెళ్లిపోతానని చెప్పింది. రైల్వేస్టేషన్‌కు సుమారు కిలోమీటర్ దూరం వెళ్లిపోగా ఆమె వెంట వెళ్లిన షర్మిల తన భర్తతో ఆమెకు సంబంధం ఏంటని గొడవకు దిగింది. అంతేకాకుండా ఆమె మెడలో ఉన్న చున్నీతో గొంతుకు బిగించగా, మిగిలిన ముగ్గురు షర్మిలకు సహకరించి కాళ్ళు, చేతులు పట్టుకున్నారు. కమలకు రక్తస్రావం కావడంతో ఆమెను వదిలి ఆమె ఏడాదిన్నర కుమారుడు తరుణ్‌ను తీసుకుని వెళ్లి ఎస్.కోటలో రోడ్డుపై విడిచిపెట్టి పరారయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న కమలను స్థానికులు 108లో అరకు ఆస్పత్రికి తరలించారు.

ఎస్.కోట పోలీసులు ఒంటరిగా రోడ్డుపై రోదిస్తున్న తరుణ్‌ను గుర్తించి అనాథలకు సేవ చేసే నేచర్ సంస్థకు అప్పగించారు. కమల వాంగ్మూలం మేరకు డుంబ్రిగుడ ఎస్ఐ వై.అమన్‌రావు కేసు నమోదు చేసి, నిందితులు నలుగురిపై ఐపీసీ 363, 307, 323 రెడ్ విత్ 34 సెక్షన్లతో ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన సబ్‌జడ్జి సత్తి అరుణశ్రీ నిందితులపై మోపిన అభియోగాలు సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఏడేళ్ళపాటు కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

గోపాలపురంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని గోపాలపురం గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

కశింకోట : స్థానిక ఏపీఈపీడీసీఎల్(ఆర్‌ఈసీఎస్) సెక్షన్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని శుక్రవారం నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాల వల్ల వివిధ రూపాల్లో ప్రజలపై మోపుతున్న విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, వివిధ సంఘాల ప్రతినిధులు సీతారత్నం, దేవి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, ఎం.అప్పలరాజులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి నిర్మల, ఏఎస్ఐ రమణమ్మ, వీఆర్వో డి.ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సన్యాసినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలతో ఇబ్బంది

కశింకోట : మండల ప్రజలు ఉష్ణ తాపంతో గత మూడు రోజులుగా అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్నారు. శుక్రవారం సాయంత్రం చిన్నగా వడగాడ్పులు కూడా వీచాయి. దీంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందిపడ్డారు. రుతుపవనాల ప్రభావంతో చల్లబడుతుందనుకున్న వాతావరణం మళ్లీ పూర్వపు స్థితికి చేరడంతో చాలా వరకు జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో ప్రధాన రోడ్లు జన సంచారం లేక బోసిపోయాయి.

ఫ్రైడే డ్రై డే



మాట్లాడుతున్న జెడ్పీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : ఆరోగ్యంగా జీవించాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ ఎస్.వెంకటరమణ అన్నారు. స్థానిక వేల్పులవీధిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. తడి-పొడిచెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ఫాగింగ్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విత్తు నుంచి విక్రయం వరకు

నాడు : వ్యవసాయం అంటే రైతులకు ఏడాది పొడవునా కష్టాలే. ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు వచ్చి రోజుల తరబడి క్యూలో నిల్చుని పడిగాపులు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించేది కాదు. రైతుల బినామీ పేర్లతో యంత్ర పరికరాలన్నీ టీడీపీ నాయకులే తీసుకునేవారు.

నేడు : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. రైతులు ఇబ్బందులు పడకుండా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. విత్తు నుంచి విక్రయం వరకూ అన్నదాతలకు అండగా నిలబడుతున్నాయి.



నూతనంగా నిర్మించిన గోపాలపురం రైతు భరోసా కేంద్రం



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- రైతన్నకు వెన్నుదన్నుగా ఆర్బీకేలు
- గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువుల పంపిణీ
- రైతులకు తప్పిన వ్యయ ప్రయాసలు

అనకాపల్లి రూరల్ : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. రైతన్నలకు అన్ని విధాలా చేయూతనిస్తుండటంతో వ్యవసాయ రంగం బలోపేతమైంది. రైతు భరోసా పథకం కింద వ్యవసాయానికి పెట్టుబడి సాయం, భూసార పరీక్షలు, రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు ఇవ్వడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతన్నల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆర్బీకేలతో రైతన్నకు భరోసా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతులకు సేవలందించేలా రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. దీంతో ఉన్న ఊరిలోనే రైతన్నలకు సేవలందుతున్నాయి. పంటల సాగు సలహాలతో పాటు ప్రభుత్వ పథకాలపై రైతులను చైతన్యపరుస్తున్నారు. ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాల సేవలపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతు తనకు ఏ ఎరువులు కావాలో స్వయంగా ఆర్డర్ పెట్టుకునేలా డిజిటల్ కియోస్క్ సేవలు అందుబాటులోకి రావడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రైతులు దోపిడీకి గురి కాకుండా, ఆర్బీకేలు అడుగడుగునా రక్షణ కల్పిస్తున్నాయి.

ఆర్బీకేల్లో అందుతున్న సేవలు

- ఖరీఫ్, రబీ సీజన్లలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు రైతులకు పంపిణీ.
- పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా.
- వైఎస్సార్ పొలంబడిలో భాగంగా రైతుల పొలాల వద్దకు వెళ్లి సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు.
- పంటల సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతులు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత.
- వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రూ.15 లక్షల విలువచేసే యంత్ర పరికరాలను రాయితీతో అందిస్తున్నారు.
- ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు రైతులకు సహకారం అందిస్తారు.

అనకాపల్లి సబ్ డివిజన్‌లో మండలాల వారీగా వివరాలు ఇలా..

మండలం	ఆర్బీకేలు	రైతులు	ఖరీఫ్‌సాగు (ఎకరాల్లో)	రైతు భరోసా మంజూరు
అనకాపల్లి	35	15,465	10,871	రూ.8.50 కోట్లు
కశింకోట	19	15,636	6,366	రూ.5.93 కోట్లు
మునగపాక	21	11,267	9,026	రూ.6.19 కోట్లు
సబ్బవరం	17	10,450	16,300	రూ.5.75 కోట్లు
పరవాడ	12	5,552	8,564	రూ.3.03 కోట్లు

ఊర్లోనే అన్నీ అందుతున్నాయి



సీఎం జగన్ ప్రభుత్వంలో రైతుల కష్టాలు దాదాపు తొలగిపోయాయి. ఆర్బీకేల ఏర్పాటుతో విత్తనాలు, ఎరువుల కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు. అన్నీ ఊరిలోనే అందుతున్నాయి. విత్తనాల కోసం గతంలో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు గ్రామంలోనే సులభంగా విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. సాగుకు ముందే రైతు భరోసా నిధులు జమ అయ్యాయి.

– మొల్లి అప్పారావు, రైతు, జగన్నాథపురం

రైతుల్లో ఆత్మస్థైర్యం



ఆర్బీకేలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. వీటి ఏర్పాటుతో గతంలో రైతులు అనుభవించిన ఎన్నో అవస్థలు తొలగిపోయాయి. రైతుల కష్టాలు గుర్తించి, వారి మేలు కోసం సీఎం జగన్ ఇలాంటి ఆలోచన చేయడం, అంతే స్థాయిలో అమలు చేయడం గొప్పగా ఉంది. ప్రభుత్వ కృషి వల్ల రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది. జగనన్న వ్యవసాయాన్ని పండగలా మార్చేశారు.

– బొడ్డపాటి నూకినాయుడు, రైతు, తుమ్మపాల

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నాం. వ్యవసాయ సిబ్బంది ప్రతి రోజూ అందుబాటులో ఉంటారు. రైతులు వ్యవసాయానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా ఆర్బీకేలను సంప్రదించవచ్చు. విత్తనాల కొనుగోలు నుంచి పంట విక్రయం వరకు సూచనలు, సలహాలు పొందవచ్చు. రైతులు ఆర్బీకేలను సద్వినియోగపరుచుకోవాలి.

– పీయూటీపీ రంగాచారి, ఇన్‌చార్జి ఏడీఏ, అనకాపల్లి

క్యాన్సర్ రోగికి పీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



క్యాన్సర్ రోగి భర్తకు చెక్కును అందిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : ప్రధానమంత్రి సహాయనిధి ద్వారా పెందుర్తి మండలం దేశపాత్రునిపాలేనికి చెందిన క్యాన్సర్ రోగి జోగేశ్వరికి మంజూరైన రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని ఎంపీ బీవీ సత్యవతి అందించారు. శుక్రవారం తన కార్యాలయంలో జోగేశ్వరి భర్త రవికుమార్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా జోగేశ్వరి క్యాన్సర్ వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందిపడుతోందన్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఈ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాంద్రేగుల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వార్డు సమస్యల పరిష్కారానికి వినతి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు

అనకాపల్లిటౌన్ : స్థానిక 83వ వార్డు పరిధిలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేయాలని కోరుతూ కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు జీవీఎంసీ మేయర్ హరివెంకట కుమారికి విశాఖలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. వార్డు పరిధిలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో రహదారులు, డ్రైనేజీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వాటికి అనుసంధానంగా పూర్తి చేయాల్సిన చిన్నచిన్న పనులను వీలైనంత వేగంగా జీవీఎంసీ నిధులతో చేపట్టాల్సిందిగా ఆ వినతిపత్రంలో కోరారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి



కశింకోట అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ప్రభావతి

కశింకోట : బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ రాష్ట్ర సభ్యురాలు ఆదిలక్ష్మి కోరారు. కశింకోటలోని గాడి వీధిలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో అమ్మాయిలకు 18 ఏళ్ల వయసు దాటాకే వివాహాలు జరపాలని, ఆలోపు జరిపే వివాహాలు బాల్య వివాహాలుగా పరిగణించి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే సీడీపీవోకు గానీ, తహసీల్దార్‌కు గానీ సమాచారం అందించాలని సూచించారు. బాలికల రక్షణకు పోక్సో, దిశ వంటి చట్టాలున్నాయని, వీటి పట్ల తమ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలన్నారు. పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు రుచి, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గౌరీపతి



కె.వి.గౌరీపతి

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా విశ్రాంత డీఈవో కన్నేపల్లి వెంకట గౌరీపతి ఎన్నికయ్యారు. గురువారం ద్వారకా తిరుమలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి ఉడ్‌పేటకు చెందిన గౌరీపతి ఎన్నిక అభినందనీయమని జిల్లా అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా గౌరీపతి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖలో వివిధ సేవా కార్యక్రమాలతో పాటు, కరోనా సమయంలో చేతనైనంత మేరకు వృద్ధులకు సాయపడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత బాధ్యతలతో వృద్ధుల సంక్షేమానికి తన వంతుగా మరింత కృషి చేస్తానన్నారు.

అవగాహనతోనే మలేరియా నియంత్రణ



కశింకోటలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న వరహాలదొర



కశింకోట బస్ స్టేషన్‌లో మలేరియా వ్యాధి నియంత్రణపై వివరిస్తున్న సిబ్బంది

కశింకోట : రానున్న వర్షా కాలం దృష్ట్యా దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి వరహాలదొర సూచించారు. కశింకోటలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌లో మలేరియా నివారణ మాసోత్సవాల ముగింపు సందర్భంగా మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు నీటి నిల్వలు లేకుండా పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. అనంతరం మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, మలేరియా యూనిట్ అధికారి ఐ.శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ సుబానీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నిర్మాణం

- స్థల వివాదంపై పలకా రవికుమార్



రిజిస్ట్రేషన్ పత్రాలను చూపిస్తున్న రవికుమార్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ నిబంధనల మేరకు స్థలాన్ని కొనుగోలు చేసి, జీవీఎంసీ అధికారుల నుంచి అనుమతి పొంది గృహ నిర్మాణం చేస్తుంటే రాజకీయ దురుద్దేశాలతో వామపక్ష నాయకులతో తప్పుడు ఆరోపణలు చేయించడంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవికుమార్ ఆక్షేపించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి ప్రైవేట్ హాల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీనగరం సర్వే నెం.348లో 800 చ.గ.ల స్థలం వివాదంపై ఆయన వివరణ ఇచ్చారు. 1975 నుంచి 2014 వరకు ఆ స్థలం చేతులు మారిన వ్యవహారం, కోర్టు కేసుల్లో తుది ఉత్తర్వులను డాక్యుమెంట్ల ఆధారంగా మీడియా ముందు వెల్లడించారు. 2014లో ఆ స్థలాన్ని ఇద్దరు వ్యక్తులతో కలిసి, కొనుగోలు చేసి, అప్పటి మున్సిపాలిటీ నుంచి భవన నిర్మాణ ప్లాన్ పొందినట్టు తెలిపారు. అనివార్య కారణాలతో ఆ సమయంలో నిర్మాణం చేసుకోలేదన్నారు. సదరు ఇద్దరు వ్యక్తులకు చెందిన స్థలాన్ని కూడా 2022 జూలై 20న కొనుగోలు చేసినట్టు పత్రాలు చూపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు బిల్డింగ్ ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు. వారి ఆమోదం మేరకే నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవుపలికారు.

ఫార్మా ప్రమాదంపై దర్యాప్తు జరపాలి

అనకాపల్లి రూరల్ : అచ్యుతాపురం సెజ్‌లో సాహితీ ఫార్మా ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కాళ్ల లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అచ్యుతాపురం, పరవాడ ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా వాటిని నివారించడానికి అధికార యంత్రాంగం సరైన చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రమాదాల నివారణకు కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి

ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని సీఐటీయూ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకర్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా మీడియాకు తెలిపారు.

వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

- లేకుంటే సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తా
- జోనల్ సమస్యలపై దాడి రత్నాకర్



జోనల్ కార్యాలయం ముందు విలేకరులతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తుంటే అనకాపల్లి జోనల్ అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాలను శుక్రవారం ఆయన పరిశీలించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం, జోనల్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం, తాగు నీటి సరఫరా, వీధి దీపాల పునరుద్ధరణ, కాలువల్లో పూడిక తొలగింపు, వీధి కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోవాలని అధికారుల్ని కోరారు. జీవీఎంసీ పరిధిలో అనకాపల్లి ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించడం శోచనీయమన్నారు. జీవీఎంసీ పరిధిలో కాంట్రాక్టులు పనులు చేయాలంటే ముడుపులివ్వాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించట్లేదని ఆరోపించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జోనల్ అధికారులతో సమావేశం నిర్వహించి, అనకాపల్లి జోన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించినప్పటికీ అధికారుల్లో చలనం లేకుండా పోయిందన్నారు. జోన్ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న వీధి దీపాలు, తాగునీరు, పంటకాలువల్లో పూడిక తొలగింపు, వీధికుక్కల బెడద, దోమల నియంత్రణ, జోనల్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండాలనన ఆరు సమస్యలపై మాట్లాడారు.

జీవీఎంసీ కమీషనర్ నెలకోసారి అనకాపల్లి జోన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉండి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు హెచ్చరించారు. సంక్షేమ పథకాలు అందించడంతోపాటు స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కారానికి, పారదర్శకత, సుపరిపాలనకు ప్రభుత్వం కార్యాచరణ చేస్తుంటే జోనల్ అధికారులు దీనికి వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, వైఎస్సార్‌సీపీ నేతలు మళ్ల రాజా, శిలపరశెట్టి బాబీ, విల్లూరి రాము, కోటిపల్లి జేజిబాబు, పలకా కాసులు, వియ్యపు శ్రీనివాస్‌యాదవ్, కర్రి శ్రీరామన్నారాయణ, తాకాశి సతీష్, భీశెట్టి కృష్ణ అప్పారావు, కర్రి అప్పాజీ, దొడ్డి రమణ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు



విజ్ఞాన సంబంధిత పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుపై ఇష్టం పెంచుకోవాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. పట్టణంలోని గవరపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీ, ప్రాజెక్ట్స్, లాబ్స్‌పై డైట్ కళాశాలలో శుక్రవారం అవగాహన కలిగేలా సందర్శన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆధునిక సాంకేతికతతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాల సందర్శన అనంతరం విద్యార్థులకు పరిజ్ఞానం పెంచే పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, హైస్కూల్ ఉపాధ్యాయురాలు నీరజ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి



నెహ్రూచౌక్ కూడలి వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అనకాపల్లి రూరల్ : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీల అదనపు భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వం చూడాలని కోరుతూ వామపక్ష పార్టీల నాయకులు శుక్రవారం పట్టణంలోని నెహ్రూచౌక్ కూడలి వద్ద ధర్నా చేపట్టారు. ఈ మేరకు స్థానిక ఏపీఈపీడీసీఎల్ డీఈకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, సీపీఐ(ఎంఎల్) జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్, వామపక్ష పార్టీల నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.దొరబాబు, ఎ.బాలకృష్ణ, గంటా శ్రీరామ్, వైఎస్ భద్రం, ఆర్.శంకరరావు, కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి, కె.తేలయ్యబాబు, తాకాసి వెంకటేశ్వరరావు, కె.శంకరరావులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

లవ్ యూ రామ్	రాజా
టక్కర్	సత్యనారాయణ స్క్రీన్-1
ఇండియానా జోన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)	
మాయా పేటిక (ఫస్ట్,సెకెండ్ షో)	షిర్డిసాయి
అశ్విన్స్	పర్తిసాయి
నారాయణ అండ్ కో	వెంకటేశ్వర
స్పై	శ్రీసత్య
సామజవరగమన	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

